# 1946 జులై 4

# వీరోచిత తెలంగాణా రైతాంగ సాయుధ పోరాట విజయాలను చరిత్ర నుండి తుడిచిపెట్టలేరు

**ఆంధ్ర** మహాసభ ప్రారంభించగా, కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో సాగిన వీరోచిత తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటం బ్రిటిష్ సామ్రాజ్యవాదుల దన్నుతో సాగుతున్న నీచమైన నైజాం నవాబు నియంతృత్వ పాలనను చావుదెబ్బ తీసింది. నిజాం ఉక్కుపాదం క్రింద చెప్పనలవికాని అనేక నిర్బంధాలతో బాధలనుభవిస్తున్న ప్రజానీకాన్ని ఈ పోరాటం విముక్తి చేసింది.

అయితే నేడు-సత్యానంతర (పోస్ట్‌ట్రూత్), దూషిస్తూ నిరాకరించే (గ్యాస్‌లైటింగ్) యుగంలో, తెలంగాణాను నిజాం నుండి విముక్తి చేసిన ప్రతిష్టను స్వంతం చేసుకునేందుకు బడా పాలకవర్గ రాజకీయ పార్టీలైన కాంగ్రెస్, బిజెపిలు రెండూ ఘర్షణ పడుతున్నాయి. తెలంగాణా తాడిత, పీడిత ప్రజానీకపు విముక్తి ప్రదాతలు తామే అయినట్లుగా ఈనాడు వారు భారీ, తప్పుడు ప్రకటనలు చేస్తున్నారు. నిజాం క్రూర పాలన నుండి తెలంగాణాను విముక్తి చేసిన కీర్తి ప్రతిష్టలను కబళించటం కోసం తప్పుడు కథనాలతో, ప్రకటనలతో మోసపూరితంగా చరిత్రను వారు తప్పుదోవ పట్టిస్తూ, వక్రీకరిస్తున్నారు.



అసలు వాస్తవం, 1946 జులై 4న కడివెండి అనే గ్రామంలో నిజాం సంస్థానంలో నవాబు యొక్క ఫ్యూడల్, నియంతృత్వ పాలనకు వ్యతిరేకంగా నిర్ణయాత్మక ప్రతిఘటన జరిగింది. నిరంకుశ ఫ్యూడల్ పాలనకు వ్యతిరేకంగా ప్రజల చైతన్య వెల్లువను ఓడించేందుకు ఫ్యూడల్ దొరలందరూ విసునూరి రామచంద్రారెడ్డి నాయకత్వంలో ఆ రోజునే కుట్ర జేశారు. వారి కుట్రను భగ్నంచేసి, తిప్పికొట్టాలని అదే రోజుననే కమ్యూనిస్టు పార్టీ నిర్ణయించింది. అదేరోజున పీడిత ప్రజానీకం ఫ్యూడల్ దొర గడీవైపుగా కదంతొక్కి, తమ సాంప్రదాయక ఆయుధాలతో తలపడ్డారు.

ఫ్యూడల్ దొరల కిరాయి గూండాలు కదులుతున్న ప్రజానీకం పై కాల్పులు జరిపి, ముందుభాగాన వున్న దొడ్డి కొమరయ్యను కడతేర్చారు. ఈ సంఘటన ప్రజానీకంలో ఆగ్రహ జ్వాలలను రగిలించింది. వారి క్రోధం లావాలా ప్రవహించింది. ఆ సమయంలో అందుబాటులో నున్న కామ్రేడ్స్ దేవులపల్లి వెంకటేశ్వరరావు, ఆరుట్ల రామచంద్రారెడ్డి, భీమిరెడ్డి నర్సింహా రెడ్డి, మరికొందరు నాయకులు భూస్వాముల కుట్రలను ధ్వంసం చేసేందుకు ప్రజా ప్రతిఘటనకు నాయకత్వం వహించి దిశానిర్దేశం చేశారు. ఫ్యూడల్ భూస్వాములకు వ్యతిరేకంగా తమ పోరాటంలో ప్రజలు కర్రలు, విల్లంబులు వంటి అందుబాటులోనున్న సాంప్రదాయక ఆయుధాలను ఉప యోగించాలని నాయకులు ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రజలు గడీని చుట్టముట్టి, పొగబాంబుల నుపయోగించి, గడీని తమ అధీనంలోకి తెచ్చుకొని దానిని ధ్వంసం చేశారు; యజమానులు, ఫ్యూడల్ భూస్వాములు పలాయనం చిత్తగించారు.

ఈరోజు-తెలంగాణా పోరాటాన్ని ప్రారంభించిన రోజు. తెలంగాణా రైతాంగ సాయుధ పోరాట తొట్టతొలి అమరవీరుడు దొడ్డి కొమరయ్య నేలకొరిగిన రోజు, ఈరోజు. క్రూర నిరంకుశ నైజాం నవాబు గోరీ తవ్వటం మొదలైన రోజు, ఈరోజు. ఫ్యూడల్ బంధనాలు, బానిసత్వాల నుండి విముక్తి ప్రారంభమైన రోజు, ఈరోజు. ఫ్యూడల్ భూస్వాముల పతనం ప్రారంభమైన రోజు, ఈ రోజు. గ్రామవలంటరీ దళాలు, ప్రజాగెరిల్లా దళాలు, గ్రామ ప్రజా అధికారంకోసం సంఘటిత మవటం మొదలైన రోజు. పీడిత తెలంగాణాను విముక్తి చేసేందుకు తమ సమయాన్ని, శక్తియుక్తులన్నింటినీ ధారపోసిన ఆనాటి కమ్యూనిస్టు పార్టీకే, దీనంతటి కీర్తి ప్రతిష్టలు దక్కుతాయి.

ఆంధ్ర మహాసభ, కమ్యూనిస్టు పార్టీల నాయకత్వంలో తెలంగాణా ప్రజానీకం భూస్వాముల నుండి 10 లక్షల ఎకరాలను స్వాధీనం చేసుకున్నారు. వారి గ్రామాలను వారే పరిపాలించారు. నిజాం పాలనకు దన్నుగానున్న దుష్ట ఖాసిం రజ్వీసైన్యాన్ని వారు మట్టి కరిపించారు. కమ్యూనిస్టు పార్టీ, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీలు ఖాసిం రజ్వీ సైన్యమైన రజాకార్లకు వ్యతిరేకంగా యుద్ధాన్ని ప్రకటించాయి. నిజాం పాలనను అంత మొందించేందు కోసం తెలంగాణా ప్రజానీకం అసమాన త్యాగాలతో కూడిన వీరోచిత పోరాటాలు చేశారు.

సరిగ్గా ఈ సమయంలోనే, కేంద్ర హోంమంత్రి వల్లభాయి పటేల్ సంస్థానాలను భారత యూనియన్‌లో విలీనం చేసే

'పవిత్ర కర్తవ్యాన్ని' చేపట్టాడు. అదే సమయంలో నెహ్రూ 'పోలీస్ చర్య' పేరుతో యూనియన్ బలగాలను తెలంగాణా పైకి పంపాడు. బాధలనెదుర్కొంటున్న ప్రజలకు అండగా నిలబడే బదులుగా, కమ్యూనిస్టుల నాయకత్వంలోని ప్రజాఉద్యమాలను అణచివేసేందుకే ఈ బలగాలు పూనుకున్నాయి. గ్రామాల నొదిలి పారిపోయిన ఫ్యూడల్ దొరలు కాంగ్రెస్ పాలకుల మద్దతుతో గ్రామాలకు తిరిగి చేరుకున్నారు. యూనియన్ పోలీసు బలగాలకు, ప్రజలకు నదుమ జరిగిన పోరాట క్రమంలో నాలుగు వేల మందికి పైగా ప్రజాసైన్య నాయకులు, కార్యకర్తలు చావోరేవో తేల్చుకునే స్ఫూర్తితో తమ ప్రాణాలను త్యాగం చేశారు. వారి మరణం-ఒక వీరోచితమైనది.

విముక్తి కోసం సాగిన మహత్తర తెలంగాణా రైతాంగ సాయుధ పోరాట చరిత్ర అంటే ఇది. మన దేశంలోని అర్ధవలస – అర్ధఫ్యూడల్ వ్యవస్థను అంతంచేసేందుకు భారత విప్లవానికి ఇదొక మార్గాన్ని చూపింది. అయితే గత కొన్ని దశాబ్దాలుగా పాలకవర్గ పార్టీలు, నిజాం నుండి తెలంగాణాను విముక్తి చేసిన కీర్తి తమదేనని తప్పుడు పద్ధతుల్లో ప్రకటించుకుంటున్నాయి.

తెలంగాణా విముక్తికి వల్లభాయ్ పటేల్ కారణమని బిజెపి నాయకత్వం పదేపదే ప్రకటించుకుంటోంది. భావజాలపరంగా పటేల్ ఆలోచనలు, తమవీ ఒకటేనని వారు ప్రకటిస్తున్నారు. మరోవైపున కాంగ్రెస్, తెలంగాణా రైతాంగ సాయుధ పోరాట కాలంలో యూనియన్ బలగాలను పంపాడు కనుక, తెలంగాణా విముక్తి ప్రదాత నెహ్రూ అని పొగుడుతోంది.

ఈ రకమైన తప్పుడు ప్రకటనలతో, ప్రచారాలతో, ఈ రెండు పాలకవర్గ పార్టీలు తెలంగాణా విముక్తి కీర్తిప్రతిష్టలను, గౌరవాలను కాజేయటానికి మాత్రమేగాకుండా, ఈ తరహా ప్రచారంతో ప్రజలను మోసగించి ఎన్నికలలో లబ్ధి పొందాలని కూడా భావిస్తున్నాయి.

ఆనాటి కాంగ్రెస్ పార్టీ నాయకత్వం, మాజీ సంస్థానాధీశుల రాచరిక హక్కుల, అధికారాల పరిరక్షణకు గ్యారంటీనిచ్చింది. ఆవిధంగా వారు సంస్థానాధీశులతో రాజీపడి, ఆనాటి తెలంగాణా ప్రజా ఆకాంక్షలకు ద్రోహం చేశారు. భూమి, భుక్తి కోసం రైతాంగం సాగించిన సాయుధ పోరాటాన్ని అణచివేయటం ద్వారా, తెలంగాణా రాష్ట్రాన్ని భారత యూనియన్‌లో విలీనం చేశారు.

నెహ్రూ, పటేల్‌ల వంచన ఆవిధంగా సాగింది. నేడు బిజెపి పటేల్‌ను స్వంతం చేసుకుంటోంది. నేడు కాంగ్రెస్, బిజెపిలు రెండూ చారిత్రక వాస్తవాలను వక్రీకరించి, తప్పుడు పద్ధతుల్లో వ్యాఖ్యానిస్తూ, తెలంగాణా విముక్తిగా చెప్పబడే దాని కీర్తిని కొట్టేయటానికి ఘర్షణ పడుతున్నాయి.

సైనిక బలగాలతో, రాజకీయ కుటిలత్వంతో తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటం అణచివేయబడకుండా వుండి వుంటే, తెలంగాణా ప్రజానీకం, పార్లమెంటరీ ప్రజాస్వామ్య ముసుగులో కొనసాగుతున్న అర్ధవలస-అర్ధఫ్యూడల్ వ్యవస్థను కూలద్రోసి నిజమైన విముక్తిని అనుభవిస్తూ వుండి వుండేవారన్నది వాస్తవం.

తెలంగాణా విముక్తిగా చెప్పబడే దాని కీర్తిప్రతిష్టలను అనుచితంగా ప్రకటించుకోవటం, 1946-50ల నడుమ సాగిన తెలంగాణా రైతాంగ పోరాట వీరోచిత, వాస్తవిక చరిత్రను ఏ విధంగానూ తుడిచిపెట్టటం సాధ్యంకాదు; తుడిచిపెట్టలేరు కూడా.

*****